రాష్ట్ర పర్యాటకులను సురక్షితంగా తీసుకురండి: కేటీఆర్

శ్రీనగర్‌లో చిక్కుకున్న రాష్ట్ర పర్యాటకులను సురక్షితంగా హైదరాబాద్‌కు తీసుకురావాలని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తిచేశారు. రాష్ర్టానికి చెందిన 80 మంది పర్యాటకులు మంగళవారం నుంచి శ్రీనగర్‌లోని ఓ హోటల్‌లో తలదాచుకున్నట్లు, వారిని వెంటనే తీసుకొని వచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎక్స్ వేదికగా ఆయన కోరారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం వారికి అండగా నిలవాలని, అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. పర్యటన కోసం వెళ్లిన తెలంగాణకు చెందిన సుమారు 80 మంది శ్రీనగర్‌లోని ఓ హోటల్‌లో తలదాచుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తమను సురక్షితంగా హైదరాబాద్‌కు చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ సామాజిక మాధ్యమాల ద్వారా వారు ఓ వీడియోను విడుదల చేశారు. హోటల్‌లో ఉన్నవారిలో హైదరాబాద్ నుంచి 20 మంది, వరంగల్ నుంచి 10 మంది, మహబూబ్‌నగర్ నుంచి 15 మంది, సంగారెడ్డి నుంచి 10 మందితోపాటు మెదక్ పట్టణానికి చెందిన రెండు కుటుంబాలు ఉన్నట్లు సమాచారం. వీరంతా మంగళవారం జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లి శ్రీనగర్ హోటల్‌లో దిగారు. అకస్మాత్తుగా పహల్గాం ఘటన చోటుచేసుకోవడంతో వారు హోటల్‌లోనే ఉండిపోయారు.

నిఘా వైఫల్యమే: ఒవైసీ

హైదరాబాద్: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడికి కారణం నిఘా వైఫల్యమేనని ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఇది గతంలో జరిగిన యురి, పుల్వామా ఉగ్రవాద దాడుల కన్నా తీవ్రమైనదని, అత్యంత ప్రమాదకరమైనదని చెప్పారు. 'ఉగ్రవాదులు పహల్గాంలో అమాయకులను వారి మతం గురించి అడిగి, విచక్షణ లేకుండా హత్య చేశారు. దీనిని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది నిఘా వైఫల్యం కూడా' అని ఒవైసీ విలేకర్లకు చెప్పారు.

కశ్మీర్‌ను వీడుతున్న పర్యాటకులు

- 6 గంటల్లో మూడువేల మందికిపైగా తిరుగు ముఖం
- పహల్గాం ఉగ్రవాద దాడితో భయోత్పాతం

శ్రీనగర్: పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో పర్యాటకులు కశ్మీరు నుంచి వెళ్లిపోతున్నారు. వీరిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జమ్ముకశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ, పర్యాటకులు వెళ్లిపోతుండటం కలచివేస్తున్నదని, కశ్మీరు లోయ నుంచి అతిథులు వెళ్లిపోవడానికిగల కారణాలను తాము పూర్తిగా అర్థం చేసుకోగలమని తెలిపారు.

6 గంటలు, 20 విమానాలు, 3,337 మంది

శ్రీనగర్ నుంచి కేవలం 6 గంటల్లో, 20 విమానాల్లో 3,337 మంది పర్యాటకులు వెళ్లిపోయారు. వీరంతా బుధవారం ఉదయం 6 గంటల నుంచి 12 గంటల మధ్యలో భయాందోళనలతో కశ్మీరును విడిచిపెట్టారు. పలు వైమానిక సంస్థలు అదనంగా విమానాలను నడిపాయి.

విమాన చార్జీలు పెంచొద్దు..

పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఎయిర్‌లైన్ ఆపరేటర్లతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విమాన ప్రయాణ చార్జీలను పెంచకూడదని ఎయిర్‌లైన్స్ సంస్థలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. శ్రీనగర్ నుంచి విమానాలను నడుపుతున్న అన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు క్యాన్సిలేషన్, రీషెడ్యూలింగ్ చార్జీలను రద్దు చేశాయని చెప్పారు. విమానాశ్రయం వద్ద ఆహారం, తాగునీటిని అందజేస్తున్నట్లు తెలిపారు.

కశ్మీరు పర్యాటకంపై ప్రభావం

భారత ట్రావెల్ ఏజెంట్ల ఫెడరేషన్ అధ్యక్షుడు అజయ్ ప్రకాశ్ మాట్లాడుతూ, ఉగ్రవాద దాడి ప్రభావం పర్యాటకంపై కొంత కాలంపాటు ఉంటుందని చెప్పారు.

మంత్రి హెచ్చరించినా విమాన చార్జీల పెంపు

పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఇచ్చిన ఆదేశాలు ఆచరణలో అమలు కావడం లేదు. ఈ కష్టకాలంలో ప్రయాణికుల నుంచి అధిక టికెట్ చార్జీలను వసూలు చేయవద్దని ఆయన కోరినప్పటికీ ఎయిర్‌లైన్స్ సంస్థలు పట్టించుకోలేదు. ఇండిగో, స్పైస్ జెట్ విమానాల్లో గురువారం ప్రయాణించడానికి శ్రీనగర్ నుంచి ఢిల్లీకి ఎకానమీ టికెట్ ధర రూ.11,000 నుంచి రూ.13,000 వరకు చేరుకుంది. ఎయిరిండియా టికెట్ ధర రూ.21,000 నుంచి రూ.23,000 వరకు ఉంది. టికెట్లు అమ్ముడుపోయినట్లు కొందరికి మెసేజ్‌లు వచ్చాయి. ప్రభుత్వ విధానానికి, ఆచరణకు మధ్య పొంతన లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు.

కశ్మీర్‌కు 90% టూర్ బుకింగ్స్ రద్దు

కశ్మీర్ అందాలను ఆస్వాదించాలనుకున్న పర్యాటకులు పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో తమ భద్రత పట్ల ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ఢిల్లీ నుంచి బుక్ చేసుకున్న వారిలో దాదాపు 90 శాతం మంది తమ బుకింగ్స్‌ను రద్దు చేసుకున్నారు. ఇటువంటి వారిలో అత్యధికులు వచ్చే నెలలో కశ్మీరు సందర్శన కోసం వెళ్లవలసినవారే. కశ్మీరుకు వెళ్లేవారు మాత్రమే కాకుండా జమ్ములోని వైష్ణో దేవి ఆలయానికి వెళ్లాలనుకున్న వారు కూడా తమ బుకింగ్స్‌ను రద్దు చేసుకుంటున్నారు. ప్రస్తుతానికి జమ్ముకశ్మీరుకు బుకింగ్స్ చేయవద్దని శ్రీనగర్ ట్రావెల్ అసోసియేషన్ చెప్పినట్లు ఢిల్లీలోని ఓ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆపరేటర్ చెప్పారు.

పాకిస్థానీయులకు నో ఎంట్రీ

- దేశంలోని పాక్ పౌరులు 48 గంటల్లో వెళ్లిపోవాలి
- సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేత
- అటారీ- వాఘా సరిహద్దు మూసివేత
- పహల్గాం దాడి నేపథ్యంలో పాక్‌పై భారత్ చర్యలు
- కేంద్ర క్యాబినెట్ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై దౌత్యపరమైన చర్యలను భారత ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, పాకిస్థానీ జాతీయులకు భారత్‌లో ప్రవేశంపై నిషేధం విధించడం వంటి ఐదు అంశాలతో కూడిన చర్యలను భారత్ ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం భద్రతా వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీతో సమావేశమై పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిస్థితిని సమీక్షించారు. సమావేశం అనంతరం భారత ప్రభుత్వం పాకిస్థాన్‌పై చేపట్టిన ఐదు చర్యలను ప్రకటించింది.

- 1960లో పాక్‌తో కుదుర్చుకున్న సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలుపుదల చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. సీమాంతర ఉగ్రవాదానికి అందచేస్తున్న మద్దతును నిలిపివేస్తున్నట్లు పాక్ నుంచి స్పష్టమైన, విశ్వసనీయమైన ప్రకటన వెలువడే వరకు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.
- అటారీ-వాఘా సరిహద్దు చెక్‌పోస్టును వెంటనే మూసివేస్తున్నట్లు తెలిపింది. చట్టబద్ధమైన పత్రాలతో భారత్‌లోకి ప్రవేశించిన పాకిస్థానీ పౌరులు మే 1వ తేదీలోగా ఈ మార్గంలో తిరిగి వెళ్లిపోవచ్చని భారత్ ప్రకటించింది.
- సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్థానీ జాతీయులు భారత్‌లో ప్రయాణించడానికి అనుమతించబోమని ప్రభుత్వం ప్రకటించింది. పథకం కింద గతంలో పాకిస్థానీ జాతీయులకు జారీ చేసిన వీసాలు రద్దయినట్లేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకం కింద వీసా తీసుకుని ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాకిస్థానీ జాతీయులు 48 గంటల్లోగా భారత్‌ను వీడాలని ప్రభుత్వం ఆదేశించింది.
- ఇస్లామాబాద్‌లోని భారతీయ హై కమిషన్ నుంచి తన రక్షణ, నౌకాదళ, వైమానిక సలహాదారులను ఉపసంహరిస్తున్నట్టు భారత్ ప్రకటించింది. అదే విధంగా ఢిల్లీలోని పాకిస్థానీ హై కమిషన్‌లో ఉన్న ఆ దేశ సైనిక, నౌకాదళ, వైమానిక సలహాదారులు వారం రోజుల్లోగా భారత్‌ను వీడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.
- భారత్‌లోని పాక్ హై కమిషన్లలోని దౌత్యాధికారుల సంఖ్యను ప్రస్తుతమున్న 55 నుంచి 30కి తగ్గించాలని పాకిస్థాన్‌ను ఆదేశించినట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు.

త్వరలోనే గట్టిగా బదులిస్తాం

ఉగ్రవాదులది పిరికిపంద చర్య.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక

న్యూఢిల్లీ: అమాయక పౌరులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు త్వరలోనే గట్టి బదులిస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. కేవలం ఈ దాడికి పాల్పడిన వారినే కాకుండా, దానికి వ్యూహం పన్నిన వారినీ వేటాడుతామని ఆయన అన్నారు. పహల్గాం ఘటన, శ్రీనగర్‌లో భద్రతా చర్యల పటిష్ఠం తదితర అంశాలపై ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠిలతో చర్చల అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'కొందరు పిరికివాళ్లు మతాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ ఉగ్రవాద చర్య కారణంగా మంగళవారం అమాయక ప్రజలు ప్రాణాలను కోల్పోయారు. పూర్తి అమానవీయమైన ఈ చర్య మనల్ని తీవ్ర దుఃఖం, బాధలోకి నెట్టేసింది' అని ఆయన అన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అంతకుముందు ఆయన భద్రతా దళాలను ఆదేశించారు.

ప్రాణాలను పణంగా పెట్టి..

పర్యాటకులను కాపాడిన ముస్లిం పోనీ రైడర్

శ్రీనగర్, ఏప్రిల్ 23: ఉగ్రవాదుల దాడి నుంచి పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో ఓ స్థానిక పోనీ (పొట్టి గుర్రం) రైడ్ ఆపరేటర్ తన ప్రాణాలనే అర్పించాడు. 28 ఏళ్ల సయ్యద్ అదిల్ హుస్సేన్ షా అనే స్థానిక పోనీ రైడ్ ఆపరేటర్ సహోదరత్వానికి, సాహసానికి ప్రతీకగా నిలిచిపోయాడు. పహల్గాం సమీపంలోని బైసరాన్ ప్రాంతంలో ముస్లిమేతర పర్యాటకులను ఉగ్ర దాడి నుంచి కాపాడేందుకు అడ్డు వెళ్లిన హుస్సేన్ తన ప్రాణాలనే బలిపెట్టాడు. ఓ కుటుంబాన్ని హుస్సేన్ బైసరాన్ తీసుకువెళ్లిన సమయంలో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. అయితే పారిపోవడానికి బదులు హుస్సేన్ ఉగ్రవాదుల వద్దకు పరుగున వెళ్లి ఓ ఉగ్రవాది చేతిలోని తుపాకీని లాక్కునేందుకు ప్రయత్నించాడు. కొద్దిసేపు కాల్పులకు అంతరాయం ఏర్పడడంతో కొందరు పర్యాటకులు అక్కడి నుంచి పారిపోవడానికి అవకాశం లభించింది. అయితే ఉగ్రవాదులు హుస్సేన్‌పై కాల్పులు జరపడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. పర్యాటకులపై తుపాకీ గురిపెట్టడాన్ని చూసిన హుస్సేన్ ఒక్క క్షణం ఆలోచించలేదని, ఉగ్రవాదుల మీదకు ఉరికాడని అతని స్నేహితుడు, మరో పోనీ ఆపరేటర్ గులాం నబీ తెలిపాడు. పర్యాటకుల ప్రాణాలను కాపాడేందుకు హుస్సేన్ తన ప్రాణాలను అర్పించాడని నబీ చెప్పారు. తన కుటుంబానికి ఏకైక జీవనాధారం తన కుమారుడేనని హుస్సేన్ తల్లి రోదిస్తూ తెలిపారు. కుటుంబాన్ని పోషించడంతోపాటు అన్నీ తానై చూసుకునేవాడని, ఇప్పుడు తమకు దిక్కెవరని ఆమె వాపోయారు.

వివాహమైన ఆరు రోజులకే..

ఉగ్ర తూటాలకు బలైన నేవీ అధికారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పులలో మరణించిన నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నార్వల్‌కు ఆరు రోజుల క్రితమే వివాహమైంది. రెండేళ్ల క్రితం నేవీలో చేరిన వినయ్ తన భార్య హిమాంశీతో కలసి కశ్మీరుకు హనీమూన్ వచ్చారు. 16న ఈ జంటకు వివాహమైంది. ఉగ్రవాదుల తూటాలకు బలైపోయిన వినయ్ మృతదేహం బుధవారం ఉదయం ఢిల్లీ చేరుకుంది. త్రివర్ణ పతాకం కప్పిన భర్త శవపేటికను పట్టుకుని చూసి ఢిల్లీ విమానాశ్రయంలో విలపించిన హిమాంశీ, 'నిత్యం మిమల్ని తలచుకుని గర్వపడతాం.. ఈ దేశం మిమల్ని ఎన్నటికీ మరచిపోదు' అంటూ గద్గదస్వరంతో అన్నారు. 'ఆయన ఆత్మశాంతి కోసం ప్రార్థిస్తున్నాను. ఆయన ఎక్కడ ఉన్నా అత్యుత్తమ జీవితాన్ని గడిపారు. ఆయన వల్లనే మేము ఇంకా సజీవంగా ఉన్నాము' అని హిమాంశీ తెలిపారు. హర్యానాలోని కర్నల్‌కు చెందిన 26 సంవత్సరాల వినయ్ మృతదేహం బుధవారం సాయంత్రం ఆయన స్వస్థలానికి చేరుకుంది. గురువారం ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు జరుగుతాయి.

కశ్మీర్ లోయ షట్‌డౌన్

- 35 ఏండ్లలో ఇదే తొలిసారి
- పహల్గాం దాడికి నిరసన

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని పార్టీలు, కుల, మత, వర్గ రహితంగా అందరూ తీవ్రంగా ఖండించారు. 35 ఏండ్ల తర్వాత తొలిసారిగా ఉగ్రదాడికి వ్యతిరేకంగా కశ్మీర్ లోయలో బుధవారం బంద్ పాటించారు. లోయ అంతటా పలు చోట్ల శాంతి ప్రదర్శనలు జరిపారు.

నిరసించిన అన్ని రాజకీయ పార్టీలు

మునుపెన్నడూ లేని విధంగా జమ్ముకశ్మీర్‌లోని ప్రధాన పార్టీలన్నీ పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. బీజేపీ, కాంగ్రెస్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)లతో పాటు పలు సంస్థలు నిరసనలకు నాయకత్వం వహించి, బాధిత కుటుంబాలకు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. వీరితో సామాజిక, రాజకీయ, మత సంస్థలు కూడా కలిసి నిరసనల్లో పాలుపంచుకున్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులు పాకిస్థాన్ దిష్టిబొమ్మలను, ఆ దేశ జెండాలను దగ్ధం చేసి నినాదాలు చేశారు.

ముస్లిం సంఘాల సంఘీభావం

దేశ ఐక్యత, శాంతిని ఎట్టి పరిస్థితుల్లో కాపాడుకోవాలని ప్రముఖ ముస్లింలతో కూడిన పౌర సమాజ గ్రూప్ పిలుపునిచ్చింది. అమాయకులను చంపడాన్ని ఇస్లాం ఎంతమాత్రం అంగీకరించదని, ఉగ్రవాదుల క్రూరత్వానికి అమాయక టూరిస్టులు బలవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ముష్కర మూక ఇదే!

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం 2019 ఆగస్టు 5న రద్దు చేసిన తర్వాత కశ్మీరు లోయలో ఉగ్ర కార్యకలాపాలు తగ్గిపోయాయి. అప్పుడే టీఆర్ఎఫ్ ఏర్పడింది. సైపుల్లా కసూరీ అలియాస్ ఖాలీద్ పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద గ్రూపు లష్కరే తాయిబాకు సీనియర్ కమాండర్‌గా ఉన్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడైన కసూరీ పహల్గాం ఉగ్ర దాడికి సూత్రధారిగా దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటన, భారత ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటన జరుగుతున్న సమయంలోనే ఈ దాడి జరగడం వెనుక కూడా కసూరీ వ్యూహమున్నట్లు అనుమానాలు ఉన్నాయి. భారీ స్థాయిలో మారణహోమం సృష్టించడం ద్వారా అంతర్జాతీయంగా ప్రచారం పొందాలని టీఆర్ఎఫ్ కుట్ర పన్ని ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి.

ఉగ్రవాదుల కోసం వేట

అడవుల మీదుగా తప్పించుకు పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా సంస్థలు హెలికాప్టర్ల ద్వారా జల్లెడ పడుతున్నాయి. ప్రాథమిక ఫోరెన్సిక్ విశ్లేషణ, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాల ప్రకారం ఉగ్రవాదులు మిలిటరీ-గ్రేడ్ ఆయుధాలు, అధునాతన కమ్యూనికేషన్ పరికరాలు ఉపయోగించారు. దీన్ని బట్టి వీరికి విదేశీ శక్తుల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు బాడీ కామ్‌లు, హెల్మెట్‌లో అమర్చిన కెమెరాలు ధరించారని, మొత్తం దాడి దృశ్యాలను రికార్డు చేశారని కూడా దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ముష్కరులు పూర్తి స్థాయి సన్నద్ధతతో వచ్చారని, డ్రైఫ్రూట్లు, ఔషధాలను కూడా నిల్వ చేసి పెట్టుకున్నారని తెలుస్తోంది. స్థానికుల సాయంతో ఉగ్రవాదులు కొన్ని రోజుల ముందు పహల్గాంలో రెక్కీ నిర్వహించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇద్దరు ఉగ్రవాదులు పష్తోలో(పాకిస్థానీ మూల భాష) మాట్లాడారని, మరో ఇద్దరు స్థానికులని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానిక ఉగ్రవాదులు బిజ్‌భేరా, త్రాల్‌కు చెందినవారని వారు చెప్పారు. దాడి జరిగిన తీరు, ఉగ్రవాదులు ఏకే 47 రైఫిల్స్‌ను ఉపయోగించిన విధానాన్ని బట్టి చూస్తే వీరంతా ఆయుధ శిక్షణ పొందినట్లు అర్థమవుతోందని వారు తెలిపారు. ఉగ్రవాదుల డిజిటల్ పాదముద్రలు ముజఫరాబాద్, కరాచీలోని సురక్షిత గృహాలను చూపుతున్నాయని, దీని వెనుక సీమాంతర ఉగ్రవాదుల హస్తం ఉన్నదన్న అనుమానాలను బలపరుస్తున్నాయని నిఘా వర్గాలు తెలిపాయి.

యురి సెక్టార్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చిన క్రమంలో యురి సెక్టార్‌లో మన దేశంలోకి చొరబడటానికి ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. నియంత్రణ రేఖ దాటి వీరు మన దేశంలోకి రావడానికి ప్రయత్నిస్తుండగా, సైనికులు అడ్డుకుని కాల్పులు జరిపారు. వీరిద్దరూ ఉగ్రవాదంలో సుశిక్షితులై ఉంటారని భావిస్తున్నారు. వీరిద్దరి వద్ద చిన్నపాటి యుద్ధానికి సరిపడా ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉందని, వాటిని స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో భద్రతా దళాల గాలింపు ఇంకా కొనసాగుతున్నదని, ఇంకా ఎవరైనా ప్రవేశించి ఉంటారా అన్నది నిశితంగా పరిశీలిస్తున్నట్టు వారు చెప్పారు.

కుల్గాంలో ఎన్‌కౌంటర్

కుల్గాంలో బుధవారం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకర ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. టీఆర్ఎఫ్ టాప్ కమాండర్ ఒకరిని బలగాలు చుట్టుముట్టినట్టు సమాచారం. భారత్‌లో అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఇద్దరు ముష్కరులను ముట్టుబెట్టిన కాసేపటికే తంగ్‌మార్గ్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నది.

దక్షిణ కశ్మీరులో 1500 మంది అదుపులోకి

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దక్షిణ కశ్మీరులో ప్రశ్నించే నిమిత్తం నేరచరిత్ర కలిగిన వందలాది మందిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. గతంలో ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు రికార్డుల్లోకెక్కిన కార్యకర్తలతోపాటు ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్న దాదాపు 1500 మందిని దక్షిణ కశ్మీరు వ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మూడు నిమిషాలపాటు కాల్చారు!

బెంగళూరు, ఏప్రిల్ 23: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులలో బెంగళూరు నివాసి 41 ఏళ్ల భరత్ భూషణ్ ఒకరు. ఆ సమయంలో ఆయన పక్కనే ఉన్న భార్య సుజాత, మూడేళ్ల కుమారుడు మాత్రం ప్రాణాలు దక్కించుకున్నారు. మాజీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన భరత్ బెంగళూరులోని మతికెరె ప్రాంతంలో ఉన్న తన కుటుంబానికి చెందిన డయాగ్నస్టిక్ సెంటర్‌ను చూసుకునేందుకు ఇటీవలే ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఏప్రిల్ 18న తన భార్య, కుమారుడితో కలసి కశ్మీరుకు బయల్దేరి వెళ్లిన భరత్ ఈనెల 23న బెంగళూరుకు తిరిగి రావలసి ఉన్నదని ఆయన అత్తగారు విమల తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తన కుమార్తె ఫోన్ చేసి జరిగిన దారుణాన్ని తెలియచేసిందని ఆమె చెప్పారు. తన కుమార్తె తెలిపిన వివరాల ప్రకారం ఉగ్రవాదులు ఆధార్ కార్డులు చూపించమని అడిగారని ఆమె చెప్పారు. 'మీరు ముస్లింలా లేక హిందువులా అని అడిగారు. హిందువులం అని చెప్పగానే నా భర్తను కాల్చివేశారు' అని తన కుమార్తె చెప్పినట్లు ఆమె తెలిపారు. తన అల్లుడి చేతిలో మూడేళ్ల పిల్లాడు ఉన్నాడని, పిల్లాడిని కిందకు దింపమని చెప్పి కాల్పులు జరిపారని విమల వివరించారు. ముస్లిం అయితే మిమల్ని విడిచిపెడతాం అని ఉగ్రవాదులు వారితో అన్నారని, హిందువని నిర్ధారించుకున్న తర్వాత తలపై కాల్పులు జరిపారని ఆమె తెలిపారు. మూడు నిమిషాల పాటు తన అల్లుడిపై కాల్పులు జరిపారని, ఊపిరి పోయేంతవరకు కాల్పులు జరుపుతూనే ఉన్నారని, చివరిగా తలపై కాల్చారని విమల చెప్పారు. భరత్ తండ్రి చనవీరప్ప ఓ రిటైర్డ్ ప్రభుత్వ అధికారి. హృద్రోగి అయిన ఆయన భార్యకు విషయం చెప్పడంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది.

నల్లరంగుతో మొదటి పేజీ

ఉగ్రదాడిపై జమ్ము కశ్మీర్ పత్రికల నిరసన

Rising Kashmir
TERROR STRIKES PAHALGAM

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో జరిపిన ఉగ్రదాడిపై పత్రికారంగం కూడా తీవ్రంగా స్పందించింది. అనేక ప్రముఖ వార్తాపత్రికలు తమ మొదటి పేజీలను నల్ల రంగులో ముద్రించి ఉగ్రదాడిపై తమ నిరసనను, బాధితులకు సంఘీభావాన్ని వ్యక్తం చేశాయి. ఈ అవమానవీయ ఘటనను అవి తెలుపు, ఎరుపు రంగుల్లో శక్తివంతమైన శీర్షికల ద్వారా తమ భావాన్ని వ్యక్తం చేస్తూ తీవ్రంగా నిరసించాయి. ఈ సమయంలో అన్ని వర్గాలు ఐక్యంగా నిలిచి ఉగ్రవాదంపై పోరాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి.

దేశ భద్రత కోసం మరో 150 ఉపగ్రహాలు

చెన్నై: దేశ భద్రత కోసం రానున్న మూడేళ్లలో 100-150 ఉపగ్రహాలను అందుబాటులోకి తేనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వీ నారాయణన్ చెప్పారు. వీటితో సరిహద్దు భద్రత, తీర ప్రాంత నిఘా పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మన దేశం దాదాపు 55 ఉపగ్రహాల సేవలను వినియోగించుకుంటున్నదన్నారు.సుదూర తీర ప్రాంతం ఉన్న దేశానికి ఇవి సరిపోవని తెలిపారు. అందుకే అంతరిక్ష రంగంలో సంస్కరణలు తెచ్చి రాకెట్లు, ఉపగ్రహాల నిర్మాణ రంగంలోకి ప్రైవేటు సంస్థలను అనుమతిస్తున్నట్లు చెప్పారు.

'పహల్గాం' దాడిపై సుప్రీంకోర్టు ఆవేదన

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిని సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించింది. మృతులకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, తదితరులు నివాళులర్పించారు. సంతాప సూచికగా 2నిమిషాల పాటు మౌనం పాటించారు. ఫుల్ కోర్టు మీటింగ్‌లో ఈదాడిని ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ కూడా దాడిని తీవ్రంగా ఖండించి, బాధితులకు సంఘీభావం తెలిపాయి.

హిందూత్వ విధానాలే ఈ దాడికి కారణం

కేంద్రాన్ని నిందించిన వాద్రా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: హిందువులను గుర్తించి మరీ హతమార్చిన పహల్గాం ఉగ్ర దాడిపై కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ అల్లుడు, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా బుధవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తాము బలహీనపడినట్లు ముస్లింలు భావిస్తున్నారని వాద్రా వ్యాఖ్యానించారు. మన దేశంలో హిందువులకు, ముస్లింలకు మధ్య తీసుకువచ్చిన చీలికే ఇందుకు కారణమని ఆయన చెప్పారు. కాగా, వాద్రా వ్యాఖ్యలపై బీజేపీ ఐటీ సెల్ అధిపతి అమిత్ మాల్వీయ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోనియా గాంధీ అల్లుడు సిగ్గులేకుండా ఉగ్ర చర్యను ఖండించకుండా సమర్థించడం దిగ్భ్రాంతికరమని ఆయన అన్నారు.

పీవోకేలో 42 లాంచ్‌పాడ్స్

- జమ్ముకశ్మీర్‌లో 115 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు
- నిఘా వర్గాల వెల్లడి

కశ్మీర్: వాస్తవాధీన రేఖ వెంబడి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో(పీవోకే) 42 ఉగ్ర శిబిరాలు క్రియాశీలంగా ఉన్నాయని, వీటిలో 110 నుంచి 130 మంది ఉగ్రవాదులు మకాం వేసి ఉన్నారని నిఘా సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉగ్రవాదులలో 115 మంది పాకిస్థానీ జాతీయులని కూడా అధికారులు తెలిపారు. బందిపొరాలో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి ఆయుధాలు, మందుగుండును స్వాధీనం చేసుకున్నారు. కశ్మీరులో సుమారు 70 నుంచి 75 మంది ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నారని, జమ్ము, రాజౌరీ, పూంచ్ ప్రాంతాలలో 60 నుంచి 65 మంది కార్యకలాపాలు సాగిస్తున్నారని వెల్లడించారు.

మాకు సంబంధం లేదు: పాకిస్థాన్

జమ్ముకశ్మీరులోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడితో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్ బుధవారం చెప్పారు. పాకిస్థానీ టీవీ చానల్‌తో ఆయన మాట్లాడుతూ, అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని, అది ఎక్కడ ఉన్నా తాము తిరస్కరిస్తామని తెలిపారు.

పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి

పహల్గాం ఉగ్ర దాడి దరిమిలా భారత్ తమపై ప్రతీకార దాడి చేయవచ్చని భావిస్తున్న పాకిస్థాన్ అదే జరిగితే తాము దాన్ని దీటుగా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామని బుధవారం ప్రకటించింది. పాకిస్థాన్‌లోని పంజాబ్‌కు చెందిన సమాచార శాఖ మంత్రి అజ్మా బుఖారీ మీడియాకు విడుదల చేసిన ఓ వీడియో క్లిప్‌లో తప్పుడు సాకుతో భారత్ ఎటువంటి దుస్సాహసానికి పాల్పడినా పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను రెండు రోజులపాటు తమ బందీగా ఉంచుకున్న ఘటనను ప్రస్తావిస్తూ, పోయినసారి టీ ఇచ్చామని, ఈసారి అలాంటి మర్యాదలేమీ ఉండవని అజ్మా బుఖారీ వ్యాఖ్యానించారు.

చంద్రమౌళి

కశ్మీర్ ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసుల దుర్మరణం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం సమీప బైసరాన్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఏపీకి చెందిన ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మృతులను పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి వాసి మధుసూదన్ రావు, విశాఖపట్నంకు చెందిన రిటైర్డు బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళిగా గుర్తించారు. వీరిద్దరి మృతదేహాలను బుధవారం ప్రత్యేక విమానాల్లో స్వస్థలాలకు తరలించారు. చంద్రమౌళి ఇద్దరు కుమార్తెలు అమెరికాలో ఉండగా.. వారు తిరిగొచ్చాక అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఎమర్జెన్సీ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఏపీ భవన్‌లో 9818395787 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.



తృటిలో తప్పించుకున్న కేరళ జడ్జీలు, ఎమ్మెల్యేలు

ప్రస్తుతం శ్రీనగర్‌లో క్షేమం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: జమ్ముకశ్మీర్ పర్యటనలో ఉన్న కేరళకు చెందిన పలువురు జడ్జీలు, ఎమ్మెల్యేలు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నుంచి తృటిలో తప్పించుకున్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తులు, శాసనసభ్యులతో కూడిన ఈ బృందం ప్రస్తుతం శ్రీనగర్‌లో క్షేమంగా ఉన్నదని కేరళ సీఎం కార్యాలయం వెల్లడించింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిల్ కే నరేంద్రన్, జస్టిస్ పీజీ అజిత్ కుమార్, జస్టిస్ జి గిరీశ్‌తోపాటు ఎమ్మెల్యేలు ముకేశ్, కేపీఏ మజీద్, టి సిద్దిక్, కె అన్సాలన్.. తదితరులు ఇటీవల జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లారు. ఉగ్రవాదులు కాల్పులు జరిపిన సమయంలో వీరు ఆ ప్రాంతానికి సమీపంలోనే ఉన్నారు. అదృష్టవశాత్తు వీరికి ఎలాంటి అపాయం జరగలేదు.